క్లుప్తంగా

కంటి ఆపరేషన్ రోగులకు పండ్లు పంపిణీ



చీమకుర్తి: కంటి ఆపరేషన్‌లను చేయించుకున్న వారికి గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పండ్లు పంపిణీ చేశారు. బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఈనెల 13 సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పెదకాకానికి చెందిన శంకర నేత్రాలయ ఆస్పత్రి ద్వారా నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆపరేషన్‌లకు ఎంపికైన వారిని దశల వారీగా ఆస్పత్రికి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్సులను ఏర్పాటు చేసి ఆపరేషన్‌లు చేయించారు. దానిలో భాగంగా తొలి విడత ఆపరేషన్‌లు చేయించుకున్న 150 మందికి శంకర్ నేత్రాలయ నుంచి చీమకుర్తికి వచ్చారు. అనంతరం వెంకాయమ్మ వారి ఆరోగ్యం గురించి పరామర్శించి పండ్లు అందించారు.

జిల్లా వనరుల కేంద్రానికి కంప్యూటర్లు బహూకరణ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు కలెక్టరేట్‌లోని బంగారు బాల్యం జిల్లా వనరుల కేంద్రానికి ఒంగోలు మైన్స్ అండ్ జియాలజీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ నాలుగు కంప్యూటర్లను బహూకరించారు. గురువారం జిల్లా వనరుల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు కంప్యూటర్లతో పాటు నాలుగు ప్రింటర్లు, ఒక స్కానర్‌ను కూడా అందజేశారు. ఈ సందర్భంగా బంగారు జిల్లా నోడల్ అధికారి వి.గిరిధర శర్మ మాట్లాడుతూ దుర్బలమైన, అనాథ పిల్లల వివరాలు మండలాల వారీగా, సచివాలయాల వారీగా, కేటగిరి వారీగా కంప్యూటరీకరించటానికి వీటిని అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు 18 అర్జీలు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సంతపేటలోని విద్యుత్ భవన్‌లో గురువారం వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయవాది విక్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. అదాలత్ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. విజయవాడకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్, విద్యుత్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కొత్తపట్నం, నాగులుప్పలపాడు, ఒంగోలు టౌన్, సంతనూతలపాడు, టంగుటూరు, చీమకుర్తి, మద్దిపాడు, మర్రిచెట్లపాలెం నుంచి వినియోగదారులు హాజరయ్యారు. సదస్సులో 18 మంది వినియోగదారులు అర్జీలు అందజేశారు. ఆ అర్జీలకు సంబంధించి అధికారులు వినియోగదారుని సమక్షంలోనే పరిష్కార మార్గం చూపారు. కార్యక్రమంలో ఒంగోలు ఈఈ హరిబాబు, ఎస్ఏఓ సుబ్బారావు, ఒంగోలు డీఈ పాండురంగారావు, ఇతర డీఈలు శ్రీకాంత్, మోహన్ ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేతో దోమల నివారణ

చీమకుర్తి రూరల్: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వలన దోమలను నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో దోమల నివారణపై జరుగుతున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. వర్షా కాలంలో దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా మొదలైన వ్యాధులు వస్తాయని, దోమల నివారణ మందును ప్రతి గృహంలో కూడా స్ప్రే చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు. బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామతీర్థం గ్రామంలో జరుగుతున్న స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామతీర్థం గ్రామంలోని లోని వాడని బావుల్లో గంభూషియా చేపలను ఆయన వదిలారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎస్ మధుసూదనరావు, వైద్యాధికారి హరిణి, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాదరావు పాల్గొన్నారు.



చీమకుర్తి నుంచి ఎర్రగుడిపాడు వెళ్లే చినరస్తా రహదారి దుస్థితి



కంకర తేలి పూర్తిగా ధ్వంసమైన చినరస్తా జంక్షన్ నుంచి ఎర్రగుడిపాడు వైపు వెళ్లే రోడ్డు

మాటలకే పరిమితం.. చేతలకు దూరం!

- చీమకుర్తి–మద్దిపాడు చినరస్తా రోడ్డు నిర్మాణంలో జాప్యం
- మండలంలో అధ్వానంగా గ్రామీణ రహదారులు
- మహానాడులో తీర్మానం చేసిన కూటమి ప్రభుత్వం
- ప్రమాదకరంగా కల్వర్టులు
- గ్రానైట్ లారీలతో రోడ్డు ధ్వంసం



చీమలమర్రి- మంచికలపాడు మధ్యగల చినరస్తా రోడ్డు జంక్షన్ దుస్థితి

చీమకుర్తి రూరల్: కేవలం మాటలు చెప్పి తప్పించుకోవడమే కాని చేతల్లో చూపించే ప్రభుత్వం కాదని ఒక్క ఏడాదిలోనే అర్థమైందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కేవలం పచ్చ మీడియా, తమ అనుకూల సోషల్ మీడియాల్లో తప్పా.. పాలనా ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు బాహాటంగానే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారు. గతేడాదిలో ఉగాది కల్లా మెరిసే రోడ్లు వేస్తామన్నా కూటమి సీఎం చంద్రబాబు నాయుడు ఏడాది దాటినా కూడా గుంతలు తేలిన రోడ్డుపై తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 24 పంచాయతీల్లో 42 గ్రామాలు ఉన్నాయి. ఇందులో చాలా గ్రామాల్లో రహదారులు సరిగా లేవన్నది అక్షర సత్యం. మండల పరిధిలోని చినరస్తా రోడ్డు అధిక లోడుతో గ్రానైట్ ముడి రాళ్లు, ఇసుక, గ్రావెల్, మెటల్ వాహనాల రాకపోకలతో ఉన్నరోడ్డు కాస్తా గోతులు పడి అధ్వానంగా తయారైంది. చీమకుర్తి–మద్దిపాడు కోష్టాల వద్ద జాతీయ రహదారి కలిపే చినరస్తా రోడ్డు రెండు లైన్ల రోడ్డుగా ఎప్పుడు విస్తరణ జరుగుతుందా అని వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు..

ఇటీవల జరిగిన సంతనూతలపాడు టీడీపీ నియోజకవర్గస్థాయి మహానాడులో రెండు లైన్ల రోడ్డు వేయాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి కార్యాచరణలో పెట్టగలరా అన్నా ఆలోచనల ప్రజలు ఉన్నారు. చీమకుర్తి మండలం మద్దిపాడు మండలం రెండు మండలాలను కలిపే ఈ రోడ్డు ఎప్పుడు రెండు లైన్లుగా ఏర్పడుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. చీమకుర్తి చినరస్తా రోడ్డు నుంచి మద్దిపాడు కొష్టా వద్ద జాతీయ రహదారి వరకు 22 కి.మీ దూరం ఉంది. ఈ దూరం మాత్రమే రోడ్డు విస్తరణ జరగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చీమకుర్తి నుంచి ఎర్రగుడిపాడు డొంక వరకు రోడ్డంతా తారు లేచి కంకర తేలి గుంతలు పడి దర్శనమిస్తోంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా పొలాల నుంచి రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు మరింత ఇబ్బందిగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా, ఆటోలో వెళ్లాలన్నా ఒళ్లు హూనమైపోతుందని చెప్తున్నారు. ఈమార్గంలో చీమకుర్తి నుంచి గ్రోత్ సెంటర్ వరకు గ్రానైట్ ముడిరాళ్లు తరలించే క్రమంలో రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. దీనికి తోటు అధిక లోడుతో ఇసుక, గ్రావెల్, మెటల్ వాహనాల రాకపోకలతో ఉన్నరోడ్డు కాస్తా గోతులు పడి అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, నాయకులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి త్వరితగతిన రోడ్డు పనులు చేయాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గోతులైనా పూడ్చండి..



చీమకుర్తి–మద్దిపాడు కొస్టాల వద్ద జాతీయ రహదారి కలిపే చినరస్తా రోడ్డు విస్తరణ జరగకపోవడంతో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా ముందుగా గోతులు పడిన రహదారులు కనిపిస్తున్నాయి. రోడ్డ నిర్మించకపోయినా పర్వాలేదు కనీసం గోతులైనా పూడ్చండి.

– గంగిరేకుల వెంకటరావు, ఎర్రగుడిపాడు

అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదు..



చీమకుర్తి–మద్దిపాడుకు వెళ్లే రోడ్డుపై ఒక్క కిలోమీటర్ దూరం ప్రయాణిస్తే చాలు ఒళ్లు హూనమవ్వడం ఖాయం. అంతే కాదు వర్షాకాలం వచ్చిందంటే అడుగుకో గుంతలు తలపించేల ఈ రహదారి పరిస్థితి ఉంటుంది. ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణిస్తే ఉక్కిరిబిక్కిరి కావాల్సిందే. ఈ రోడ్డును రెండు లైన్ల రోడ్డుగా విస్తరణ చేయాలని ప్రజల కోరుకుంటున్నారు.

– జడ రాజు, చీమలమర్రి

పీ-4 అమలుపై మరింత దృష్టి పెట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: అధికారులంతా పీ-4 కార్యక్రమాన్ని అమలు చేయడంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంతో పాటు సంబంధిత వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు. పీ-4 కార్యక్రమంపై జిల్లా అధికారులకు గురువారం స్థానిక ప్రకాశం భవనంలో నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించడంతో పాటు ఆయా కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా త్వరగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ-4) ఆలోచన, లక్ష్యాల గురించి రాష్ట్ర ప్రభుత్వం తరపున వచ్చిన ప్రతినిధులు అవగాహన కల్పించారు. పీ-4 కోసం రూపొందించిన పోర్టల్ గురించి వివరించారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అధికారుల సూచనలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేదరికాన్ని అధిగమించేందుకు వివిధ శాఖల వారీగా ×కీ పెరామీటర్ ఇండికేటర్స్× పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, డీపీఓ వెంకట నాయుడు, జెడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ వరలక్ష్మి, డీఎస్ఓ పద్మశ్రీ, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జ్ సీపీఓ స్వరూపరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆహిర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలి




బైకులతో యాత్ర చేస్తున్న అఖిల భారత యాదవ మహాసభ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: భారత సైన్యంలో ఆహిర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో గురువారం కార్లు, బైక్‌లతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేశ్వరి యాదవ్ మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ రెజింగ్ లా కలశ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన యుద్ధాల్లో రెజింగ్ లా యుద్ధం చాలా ప్రాముఖ్యత కలిగినదన్నారు. ఈ యుద్ధంలో అనేక వందల మంది యాదవ సైనికులు వీరమరణం పొందారన్నారు. అదే విధంగా 1310 మంది చైనా సైనికులను మన దేశ సైనికులు మట్టుబెట్టారన్నారు. శతాబ్ది ఉత్సవాల అధ్యక్షుడు బొట్ల రామారావు మాట్లాడుతూ యాదవ సైనికుల శౌర్యం వలనే చైనా దురాక్రమణను అడ్డుకున్నారన్నారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్, కలశయాత్ర కన్వీనర్ దత్తాత్రేయ, కుట్టుబోయిన కోటియాదవ్, కొత్తగోర్ల వెంకటేశ్వర్లు, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా నాగలక్ష్మి అమ్మవారు

ఒంగోలు మెట్రో: ఆషాఢ మాసంలో భాగంగా ఒంగోలు సంతపేట సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న నాగలక్ష్మి అమ్మవారికి గురువారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు నాగలక్ష్మి మూలమూర్తికి పంచామృతల అభిషేకం, సుగంధ పరిమళ ద్రవ్యాలు వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం కూరగాయలు, పండ్లతో శాకంబరీ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకుడు అళహరి చెంచలరావు పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత భవితకు బాటలు వేసుకోవాలని క్విస్ క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు పిలుపునిచ్చారు. పాలిటెక్నిక్ పూర్తి చేసుకుని నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరే విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని గురువారం కళాశాల ప్రాంగణంలోని రామానుజన్ సెమినార్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల విధి విధానాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కళాశాలకు కొత్తగా వచ్చిన విద్యార్థులకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల రెండో ఏడాది అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ శేషారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, అకడమిక్స్ డీన్ డాక్టర్ మెహర్ కళాశాల స్టూడెంట్స్ డీన్ డాక్టర్ జే.శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్స్ డీన్ డాక్టర్ జగదీశ్, క్వాలిటీ డీన్ డాక్టర్ వెంకట ప్రశాంత్, సీఎస్ సీడీఈ డైరెక్టర్ డాక్టర్ భార్గవ్, కల్చరల్స్, ఎస్ఎస్ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, వివిధ కోర్సుల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

20న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

- ఏర్పాట్లు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



పొక్లెయిన్‌తో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేయిస్తున్న పార్టీ శ్రేణులు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాలు విజయవంతం అవుతుండటంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కొత్తపట్నం గ్రామంలో నల్లూరి గార్డెన్ పక్కన ఈ నెల 20వ తేదీన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. స్టేజీ ఏర్పాటు, నాయకులు, కార్యకర్తలు కూర్చోవడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, సభాధ్యక్షుడు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బహ్మానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాదాసి వెంకయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యేలం వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం జోనల్ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, ప్రకాశం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ప్రకాశం జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరకంటి శ్రీనివాసరావు హాజరు కానున్నారు. ఈసందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 జరిగే కార్యక్రమానికి సుమారు 1500 నుంచి 2 వేల మంది హాజరవుతారని తెలిపారు. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

విమర్శలకు తావిస్తున్న మున్సిపల్ అధికారుల తీరు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం



భాగ్యనగర్ రెండో లైన్‌లో బంకులను బలవంతంగా తొలగించిన అధికారులు

ఒంగోలు సబర్బన్: నగరంలో మున్సిపల్ అధికారుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వాళ్లకు నచ్చిన వారైతే ఒక రకంగా.. నచ్చని వారైతే మరో రకంగా పక్షపాత ధోరణిని చూపిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉంటే ఒక రకంగా చేతులు తడిపితే మరో రకంగా తయారయ్యారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. వారం రోజుల క్రితం భాగ్యనగర్ రెండో లైన్‌లో రోడ్డు మార్జిన్‌లో కొందరు బంకులు ఏర్పాటు చేసుకొని వివిధ రకాలుగా జీవనోపాధిని పొందుతూ వస్తున్నారు. దీంతో కన్నుకుట్టిన అధికారులు సాయంత్రం చీకటి పడీపడగానే భారీ జేసీబీలు, పొక్లెయిన్లతో రంగంలోకి దిగారు. మరో ప్రాంతానికి మార్చుకోవడానికి ఒక్క రోజు గడువు అడిగినా ససేమిరా అని తెగేసి చెప్పారు.

మరో ప్రాంతంలో వాళ్లకు నచ్చిన వారికి..

ఇదిలా ఉంటే అది జరిగిన ఒకటి, రెండు రోజుల్లోనే నిత్యం రద్దీగా ఉండే అంబేడ్కర్ భవన్ రోడ్డులో అల్పాహారం విక్రయించుకునే బంకు వెలిసింది. అంబేడ్కర్ భవన్ ప్రహరీకి ఆనుకొని బంకు ఏర్పాటు చేయడంతో పాటు దానిపై పందిరి కూడా ఏర్పాటు చేసి రోడ్డు సగానికి వచ్చేశారు. దాంతో ఆ రోడ్డులో అక్కడ టిఫిన్ కోసం వచ్చేవారి ద్విచక్ర వాహనాలతో ఆ రోడ్డు ట్రాఫిక్‌కు అంతరాయంగా మారింది. గతంలో ఈ రోడ్డు మార్జిన్‌లో బంకులు పెట్టి ఆక్రమించారని, ఉన్న బంకులు తొలగించి రూ.40 లక్షలతో రోడ్డు విస్తరణ కూడా చేపట్టారు. ప్రజా ధనం వెచ్చించి ఆ రోడ్డు విస్తరణ చేయటం వీళ్లకోసమేనన్న విధంగా తయారైంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆ టిఫిన్ బంకు ఏర్పాటు చేశారన్నది స్థానికులు ఆరోపిస్తున్నారు. మరి అధికారులు భాగ్యనగర్ రెండో లైన్‌లో ఒకలా.. అంబేడ్కర్ భవన్ రోడ్డులో మరోలా ప్రవర్తిస్తూ పక్షపాత ధోరణిని అవలంభిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి పాలనలో దళితులపై పెరిగిన దాడులు



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయుడు రఘురాం

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సనాతనం పేరుతో దళితులపై దాడులు పెరిగిపోయాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం అన్నారు. కారంచేడు మారణ కాండ జరిగి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఎల్బీజీ భవనంలో గురువారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఊరేగించడానికి ఒప్పుకోకుండా పెత్తందారులు అడ్డుకున్నా పాలకులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అస్తిత్వ ఉద్యమాల పేరుతో దళిత ఉద్యమాలను చీలికలు పేలికలు చేస్తుందని విమర్శించారు. బీజేపీ పాలనలో దళితుల మీద దాడులు పెరిగినట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కారంచేడు మాదిగలపై అగ్రకుల భూస్వాములు జరిపిన మారణకాండకు 40 ఏళ్లు పూర్తయ్యాయని, ఆ మారణ కాండ తరువాత దళితుల ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయన్నారు. అంబేడ్కర్ తరువాత కారంచేడు దళితుల ఆత్మగౌరవ పోరాటాలకు దిక్సూచీల నిలబడిందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు అధ్యక్షత వహించారు. గడ్డం సాల్మన్, దాసరి రక్షణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలలకు నిధులు విడుదల చేయాలి

ఒంగోలు సిటీ: ఎయిడెడ్ పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ ఫండ్స్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే వెంకటరావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం పనిచేసే 132 ఎయిడెడ్ పాఠశాలలకు 2025 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు నిధులు విడుదల చేసింది కానీ ఎయిడెడ్‌కు ఇవ్వలేదన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద కట్ చేసిన రూ.2 వేలను ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలకు వెంటనే విడుదల చేయాలన్నారు.

అయ్యవార్లు లేక.. అనాథలుగా మారి !

- అగమ్యగోచరంగా కొత్తపట్నం ప్లస్ టూ విద్యార్థుల జీవితం
- ఈ ఏడాది ఒక్క లెక్చరర్ లేని దుస్థితి
- కళాశాల ప్రారంభమై నెలన్నర కావస్తున్నా పట్టించుకోని అధికారులు
- గతేడాది ఇంటర్‌లో 60 మందికిగాను ఇద్దరే పాస్
- విద్యను సర్వనాశనం చేసిన కూటమి ప్రభుత్వం



ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసిన డీఈవో కిరణ్‌కుమార్ (ఫైల్)

కొత్తపట్నం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలు నేడు కూటమి ప్రభుత్వంలో మసకబారిపోతున్నాయి. ప్రభుత్వ విద్య అంటే గిట్టని సీఎం చంద్రబాబుకు మనసంతా కార్పొరేట్ మీదనే ఉంటుంది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు తగ్గి డ్రాపవుట్‌లు పెరిగిపోతున్నాయి. తాజాగా విద్యాశాఖాధికారుల అలసత్వం కారణంగా ప్లస్ టూ విద్యార్థులు రోడ్డున పడాల్సి వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డ్రాపవట్‌లు తగ్గించడం కోసం మండలంలోనే ఒక పాఠశాలలో ప్లస్ టూ ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ప్రత్యేక గదులు కేటాయించింది. వివరాల్లో కెళ్తే.. 2024–25 విద్యా సంవత్సరంలో కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ నిర్వహించాలని ప్రభుత్వం ప్రారంభించింది. కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ప్రవేశపెట్టింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ ఏడాదిలో ఏదో తూతూ మంత్రంగా విద్యార్థులకు పాఠాలు చెప్పించింది. కాని శాశ్వత ప్రతిపాదికన లెక్చరర్లను మాత్రం కేటాయించలేకపోయింది. చివరి ఏడాదిలో ఏవైతే లెక్చరర్‌లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారో మళ్లీ రెండో ఏడాది కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

60 మందిలో ఇద్దరు మాత్రమే పాస్..

2024–25 విద్యా సంవత్సరంలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించింది. గతేడాదిలో ఎంపీసీ, సీఈసీ రెండు గ్రూపుల్లో 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపీసీలో 30 మంది చేరితే ఒకరు మాత్రమే పాసయ్యారు. సీఈసీలో 30 మంది చేరితే ఒకరు మాత్రమే పాసయ్యారు. ఈ ఏడాది 2025–26 ఏడాదికి ఫస్ట్ ఇయర్‌లో 13 మంది చేరారు. అయితే కళాశాలలు ప్రారంభమై నెలన్నర కావస్తున్నా ఇంతవరకు ఒక్క లెక్చరర్‌ను కూడా అధికారులు కేటాయించలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

అసహనం వ్యక్తం చేసిన డీఈవో..

విద్యార్థులు దిక్కు తోచక, నెల రోజులపాటు ఎదురు చూసి కార్యాలయాల చుట్టూ తిరిగారు. విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులను కలిస్తే మా పరిధిలో లేదని డీఈవో పరిధిలో ఉందని మాట దాటేశారు. హైస్కూల్ ప్లస్ విద్యార్థులు తొలుత జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో ఏ.కిరణ్ కుమార్ కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. హైస్కూల్ హెచ్ఎం, విద్యార్థులు కలిసి ఒంగోలులో తమ కార్యాలయంలో కలువగా ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. అప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈ నెల 14న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ గోడును చెప్పుకున్నారు. స్పందించిన జేసీ డీఈవోను తక్షణమే కళాశాలకు వెళ్లి పరిస్థితి పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీంతో డీఈవో అదే రోజు సాయంత్రం కొత్తపట్నం వచ్చి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. మండల హైస్కూల్ పరిధిలో గాని పీజీ చేసి ఉన్న ఉపాధ్యాయులచే విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాని గతంలో డీఈవో ఉత్తర్వులను బేఖాతరు చేసి కొత్తపట్నం రాని ఉపాధ్యాయులు కేవలం హైస్కూల్ హెచ్ఎం, ఎంఈవోలు చెప్తే ఎలా వస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శాశ్వత ప్రాతిపాదిక లెక్చరర్‌లను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.